
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 17 మే 2025

ప్రాధాన్య కేటగిరి...

- వంద శాతం దృష్టి లోపం గల వారికి ప్రాధాన్యమిస్తారు.
- 75శాతం దృష్టి లోపం, 70 శాతం నుంచి 79 వరకు శారీరక వైకల్యం గల వారికి, 70శాతం పైగా వినికిడి లోపం ఉన్న వారికి రెండో ప్రాధాన్యత.
- పునర్వివివాహం చేసుకోని వితంతువు.
- క్యాన్సర్, ఓపెన్‌హార్ట్ సర్జరీ, బోనోటీసీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేయించుకున్న వారికి.
- స్పౌజ్ లేదా పిల్లలు మానసిక రుగ్మతతో జునవైల్ డయాలసిస్, తలసేమియా, హీమోఫిలియా, కండరాల క్షీణితకు వైద్య చికిత్స పొందుతున్న వారికి అవకాశం ఇస్తారు.



బదిలీల సందడి



- ఉద్యోగుల స్థానచలన ప్రక్రియ ఆరంభం
- ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన వారు కదలాల్సిందే

శ్రీకాకుళం, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ శుక్రవారం ఆరంభమైంది. విద్యాసంవత్సరం ఆరంభం అయ్యేందుకు సుమారు నెల రోజులు గడువు ఉంది. తాజాగా ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై ఉన్న బ్యాన్‌ను 18 రోజులు ప్రభుత్వం ఎత్తివేసింది. శుక్రవారం నుంచి జూన్ 2 వరకు బదిలీల ప్రక్రియ, కౌన్సెలింగ్ ముగించాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. చాన్నాళ్ల నుంచి ఒకే సీటులో పాతుకుపోయినవారు కదలాల్సిన సమయం రాగా.. అలాగే బదిలీల కోసం ఎదురుచూస్తున్నవారికి కూడా కాస్త ఉపశమనం లభించినట్లయింది. జిల్లాలో సుమారు వెయ్యి మంది ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశం ఉంది. జూన్ 3 నుంచి బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. కాగా తాము కోరుకున్న చోటుకు కొంతమంది ఉద్యోగులు బదిలీ అయ్యేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. మరికొందరు అనారోగ్య కారణాలతో కుటుంబానికి దగ్గరగా బదిలీ చేసుకునేలా ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగ సంఘాల నేతలకు మూడు టెర్మ్‌లు మాత్రమే అవకాశం కల్పించారు. గతంలా కాకుండా... గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరరల జాబితా కలెక్టర్ నుంచి సంబంధిత డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులకు వెళ్లాలి.

ఐదేళ్లు ఒకేచోట ఉంటే.. స్థానచలనం తప్పనిసరి

గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటివరకు ఒకే చోట ఐదేళ్ల పాటు ఉద్యోగం నిర్వర్తించిన ఉద్యోగులు తప్పనిసరిగా స్థానచలనం ఉంటుంది. ఈమేరకు బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌లో ప్రభుత్వం ప్రకటించింది. అలాగే ఐదేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తికాని ఉద్యోగులు దరఖాస్తులను కూడా అభ్యర్థన పరంగా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నెల 31న రిటైర్డ్ అయ్యే ఉద్యోగులకు బదిలీ ఉండదు. అయితే వాళ్లే బదిలీ కోరుకుంటే.. అడ్మినిస్ట్రేషన్ పరంగా అవసరమనుకుంటే పరిగణనలోకి తీసుకుంటారు.

వివాదాస్పదం కాకుండా..

ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌ల ప్రక్రియ అన్ని ప్రభుత్వ శాఖలలో జరగనుంది. ఇచ్చిన గడువులోగా బదిలీలు పూర్తిచేయాల్సిన బాధ్యత.. శాఖల వారీగా ఉన్నతాధికారులదే. ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా బదిలీ చేపడితే ఎటువంటి వివాదాలు ఉండవు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సిఫారసులు... గుర్తింపు సంఘాల నుంచి లేఖలు సమర్పించడంతో బదిలీల ప్రక్రియ వివాదాస్పదమైంది. ఇటువంటివి జరగకుండా కలెక్టర్ పర్యవేక్షణ ఉంటుంది. అలాగే ప్రతి శాఖలో బదిలీకి సంబంధించి ఇంటర్నల్ కమిటీ ఏర్పాటయ్యాక... ఇదంతా జరుగుతుంది. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి, స్పౌజ్‌కోటాకు పాధాన్యముంటుంది. పదోన్నతి లభించినవారికి తప్పనిసరిగా స్థానచలనం ఉంటుంది.

ఉపాధ్యాయ, ఉద్యోగుల్లో బదిలీల సందడి నెలకొంది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయగా.. శుక్రవారం నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. నిబంధనల ప్రకారం ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన వారికి స్థానచలనం కానుంది. జూన్ 2వ తేదీ నాటికి ప్రక్రియ ముగియనుండగా.. జిల్లాలో సుమారు వెయ్యి మంది ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశం ఉంది. అలాగే ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కూడా రంగం సిద్ధమైంది. నేడో, రేపో ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయనుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 3వేల మందికి బదిలీ కానుంది.

ఉపాధ్యాయులకూ.. కదలిక

- నేడో, రేపో షెడ్యూల్ విడుదల
- జిల్లాలో 3వేల మంది బదిలీకి అవకాశం
- మోడల్ ప్రైమరీ పాఠశాలలకు హెచ్‌ఎంలుగా ఎస్‌ఏలు
- తొలిసారిగా నెగిటివ్ పాయింట్లు

నరసన్నపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు రంగం సిద్ధమైంది. దీనిపై విధివిధానాలను విద్యాశాఖ ఖరారు చేసింది. టీచర్లకు ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్ల కేటాయింపుపై కూడా స్పష్టమైన ఆదేశాలిచ్చింది. కచ్చితంగా బదిలీ కావాల్సిన హెచ్‌ఎంలు, టీచర్ల కటాఫ్ తేదీలను కూడా నిర్దేశించింది. ఒకే పాఠశాలలో 2020 ఆగస్టు 31 నుంచి పనిచేస్తున్న హెచ్‌ఎంలు, 2017 ఆగస్టు 31 ముందు నుంచి పనిచేస్తున్న ఇతర టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఉమ్మడి జిల్లాలో సుమారు 10,850 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసినవారు సుమారు 1200 మంది ఉన్నారు. సరిపడా విద్యార్థులు లేక రేషన్‌లైజేషన్ (హేతుబద్ధీకరణ)కు గురైన వారు మరో 1800 వరకు ఉన్నారు. మొత్తంగా 3వేల మంది వరకు ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఈ ఏడాది రెండేళ్ల సర్వీసు చేసిన వారికి బదిలీకి అవకాశం ఇచ్చారు. ఉపాధ్యాయులకు ప్రాధాన్యత, బదిలీలలో మార్గదర్శకాలను జారీ చేశారు. పాఠశాలలు పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు జిల్లాలో 249 మంది ఎస్‌ఏలను హెచ్‌ఎంలుగా కన్వర్షన్ చేశారు. ప్రాథమిక పాఠశాలలు, ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు, 1-10 తరగతి ఉన్న ఉన్నత పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేయగా, ఇంకా 14 మంది ఎస్జీటీలు సర్‌ప్లస్‌గా ఉన్నారు. ముందుగా హెచ్‌ఎంలను బదిలీ చేస్తారు. తర్వాత అర్హులైన ఎస్‌ఏలకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించి వారికి స్థానాలను కేటాయిస్తారు. అనంతరం ఏస్‌ఏలు, ఎస్జీటీల బదిలీలు చేపడతారు. వెబ్‌లో దరఖాస్తు కూడా ముందుగా హెచ్‌ఎంలకు, తర్వాత స్థానాల్లో ఎస్‌ఏలు, ఎస్జీటీలకు అవకాశం ఇవ్వనున్నారు. దరఖాస్తుల పరిశీలనకు జిల్లాకేంద్రంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యాయ బదిలీలపై సంఘాలు కొన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాలతో భేటీ అనంతరం మార్పులు, చేర్పులతో బదిలీలపై షెడ్యూల్‌ను శనివారం లేదంటే సోమవారం విడుదల చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే జిల్లాలో బదిలీల పక్రియ చేపడతామని డీఈవో తిరుమల చైతన్య తెలిపారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి బదిలీల దరఖాస్తులను పరిశీలించేందుకు సిబ్బందిని నియమించామన్నారు.

పాయింట్ల కేటాయింపు ఇలా...

కేటగిరీ-1 పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న టీచర్లకు సంవత్సరానికి ఒక పాయింట్, కేటగిరీ-2 మునిసిపల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి ఏడాదికి (మిగతా 6వ పేజీలో..)

క్వారీలో ఏమైంది?

- అనుమానాస్పద స్థితిలో ముగ్గురు కార్మికుల మృతి
- పిడుగుపడి ప్రాణాలు కోల్పోయారన్న గ్రానైట్ యాజమాని
- బాంబు పేలి మృతి చెందారని కుటుంబ సభ్యుల ఆరోపణ
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



వ్యాన్‌లో ఛిద్రంగా కనిపిస్తున్న కార్మికుల మృతదేహాలు

మెళియాపుట్టి, మే 16(ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురు కార్మికులు రోజూ మాదిరి.. శుక్రవారం ఉదయం క్వారీలో విధులకు హాజరయ్యారు. సాయంత్రం వేళ ఆ ముగ్గురూ పిడుగుపడి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులకు క్వారీ యాజమాన్యం నుంచి సమాచారం అందింది. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వచ్చేలోపే కొండపై నుంచి ఆ మృతదేహాలను కిందకు దించేయడంతో ఈ ఘటనపై అనుమానాలు తలెత్తాయి. క్వారీలో బాంబు బ్లాస్టింగ్ వల్లే ఆ ముగ్గురూ మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అసలు క్వారీలో ఏమి జరిగిందో చెప్పాలంటూ యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితి చక్కదిద్దారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మెళియాపుట్టి మండలం దీనబంధుపురం సమీపాన దబ్బగూడ రెవెన్యూ పరిధిలోని మనీషా కూనపురెడ్డికి చెందిన వీఆర్‌టీ గ్రానైట్ క్వారీలో ముగ్గురు కార్మికులు శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన తిర్లంగి రామారావు(40), బడబంద అప్పన్న(35)తోపాటు తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఉంగవేణు ఆర్ముగం(45) అనే మేస్త్రీ రోజూ మాదిరి శుక్రవారం ఉదయం క్వారీలో విధులకు వెళ్లారు. శుక్రవారం సాయంత్రం చీకటి పడుతున్న సమయంలో పిడుగుపడి ఆ ముగ్గురూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులకు క్వారీ యజమాని సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు (మిగతా 7వ పేజీలో..)



గ్రానైట్ యజమానితో వాగ్వాదం చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



మృతులు : ఆర్ముగం, రామారావు, అప్పన్న (ఫైల్)

ఉలిక్కిపడిన పోలవరం

టెక్కలి, మే 16(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం దీనబంధుపురానికి సమీపంలోని గ్రానైట్ క్వారీలో ముగ్గురు మృతి చెందడంతో టెక్కలి మండలం పోలవరం గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. అప్పన్న, రామారావు పోలవరానికి చెందిన వారు కావడంతో గ్రామస్థులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. పిడుగుపాటుతో ఇద్దరు మృతిచెందారని సమాచారం అందడంతో సర్పంచ్ గురువెల్లి చిన్నమనాయుడుతోపాటు పలువురు గ్రామస్థులు క్వారీ ప్రాంతానికి చేరుకోగా.. మృతదేహాలు చెల్లాచెదురుగా పడివుండడం గుర్తించారు. మృతుడు తిర్లంగి రాము స్వగ్రామం పోలవరం అయినా తన బావమరిది ఇల్లు కోటబొమ్మాళి ప్రకాష్‌నగర్ కాలనీలో ఉంటున్నాడు. అక్కడ నుంచి క్వారీకి వచ్చి విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడు రాముకు భార్య లక్ష్మి, కుమారులు సంతోష్, జగదీష్ ఉన్నారు. ఇక పోలవరం గ్రామం రజకవీధికి చెందిన అప్పన్నకు భార్య మంగమ్మతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అలాగే తమిళనాడు రాష్ట్రం తిరుమన్నావలై సెంజి గ్రామానికి చెందిన అర్ముగంకు భార్య జయంతి, కుమారుడు దినేష్ ఉన్నారు. వీరంతా కన్నీరుమున్నీర్వుగా విలపిస్తున్నారు.



ఆనందపురం వద్ద కూలిన వంతెన

కూలిన సైపాన్ వంతెన

- నిలిచిన రాకపోకలు
- వంశధార అధికారుల పరిశీలన

నందిగాం, మే 16(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం ఆనందపురం వద్ద సైపాన్ వంతెన శుక్రవారం కూలిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 26ఏళ్ల కిందట వంశధార శాఖ ఆధ్వర్యంలో కొండనీరు చెరువుకు వెళ్లేందుకుగాను ఈ వంతెన నిర్మించారు. శుక్రవారం ఉదయం మండలంలోని పాత్రునివలస నుంచి హరిదాసుపురం లారీలు వెళ్లే సమయంలో వంతెన పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ రాకపోకలు సాగించకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వంతెన కూలిపోవడంతో ఆనందపురం, హరిదాసుపురం, మాదిగాపురం తదితర గ్రామాల ప్రజలు జాతీయరహదారికి వెళ్లేందుకు మార్గం లేకుండా పోయింది. దీంతో చుట్టూతిరిగి తురకలకోట మీదుగా జాతీయ రహదారికి చేరుకుంటున్నారు. వంతెన నిర్మించే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. టెక్కలి వంశధార ఈఈ శేఖర్‌బాబు కూలిన సైపాన్ వంతెనను పరిశీలించారు. ప్రజల రాకపోకలకు వీలుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పరిశీలిస్తున్నామని తెలిపారు. వంతెన సకాలంలో నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీఈఈ సుధాకర్, జేఈ రాజశేఖర్, అభిషేక్ పాల్గొన్నారు.



డెంగీ నివారణ ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తదితరులు

అవగాహనతోనే డెంగీ నివారణ

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 16(ఆంధ్రజ్యోతి): 'డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అవగాహనతోనే డెంగీ నివారణ సాధ్యమ'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'పీహెచ్‌సీల పరిధిలో డెంగీ బాధితుల నుంచి రక్తనమూనాలు సేకరించి.. టెక్కలి, శ్రీకాకుళం ప్రభుత్వాసుపత్రుల్లో నిర్ధారణ పరీక్షలు చేస్తారు. అకస్మాత్తుగా కండరాలు, కీళ్ల నొప్పులతో కూడిన జ్వరం, శరీరంపై చిన్నపాటి దద్దుర్లు, ముక్కు, మలం ద్వారా రక్తం పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలి. డెంగీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగీ వ్యాధికి కారణమైన 'ఏడీఎస్' దోమలు ఇళ్ల పరిసరాల్లోని నీటి నిల్వల్లో పెరుగుతాయి. ప్లాస్టిక్ వస్తువులు, పూలకుండీలు, డ్రమ్ములు, టైర్లు, కూలర్లు, ఎయిర్ కండీషనర్లు, (మిగతా 6వ పేజీలో..)

కొత్తగా 20 అగ్నిమాపక యంత్రాలు

- విశాఖ రీజనల్ అధికారి నిరంజన్‌రెడ్డి

పలాస, మే 16(ఆంధ్రజ్యోతి): విశాఖ రీజియన్‌కు కొత్తగా 20 అగ్నిమాపక యంత్రాలు(ఫైర్‌ఇంజన్లు) మంజూరు చేస్తున్నట్లు రీజనల్ అగ్నిమాపకశాఖ అధికారి నిరంజన్‌రెడ్డి తెలిపారు. కాశీబుగ్గ అగ్నిమాపక కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 'విశాఖ రీజియన్‌లో 15ఏళ్లు దాటి ఫైర్ ఇంజన్లు సేవలు అందిస్తున్నాయి. కాలం చెల్లిన ఇంజన్ల వల్ల పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నాం. కొత్తగా 20 ఫైర్ ఇంజన్లను ప్రభుత్వం మంజూరు చేయనుంది. 15వ ఆర్థిక (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న రీజనల్ అగ్నిమాపకశాఖ అధికారి నిరంజన్‌రెడ్డి



శ్రీకాకుళంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ..

విజయ పతాకం

- ఘనంగా తిరంగా ర్యాలీ
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, మాజీ సైనికులు, ప్రజలు

6లో

విజయ పతాకం



శ్రీకాకుళం కలెక్టరేట్/పాత శ్రీకాకుళం: ఏడు రోడ్ల జంక్షన్‌లో ర్యాలీలో పాల్గొన్న జనం

● ఘనంగా తిరంగా ర్యాలీ

'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం తిరంగా ర్యాలీలను ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీల్లో జిల్లాలోని ప్రజాప్రతినిధులు.. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భారీ త్రివర్ణ పతకాలతో ర్యాలీలు నిర్వహించారు. అమర జవానులకు నివాళులర్పించారు. త్రివిధ దళాల ధైర్యసాహసాలను కొనియాడారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పాతపట్నం: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తదితరులు



పాతపట్నం: భారీ జాతీయ జెండాతో..



ఎల్ఎన్‌పేట: ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



శ్రీకాకుళం కలెక్టరేట్/పాత శ్రీకాకుళం: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్ తదితరులు

అదిరేటి స్టెప్పు నేనేస్తే..!



రణస్థలం డ్యాన్స్ స్కూల్లో చిన్నారులకు శిక్షణ ఇస్తూ..

● ప్రాథమిక స్థాయి నుంచి అదే ధ్యాస

● కల నెరవేర్చుకునేందుకు హైదరాబాద్‌కు...

● 13 ఏళ్లుగా డ్యాన్స్‌లో రాణిస్తున్న యువకుడు

● ప్రస్తుతం వందలాది మందికి శిక్షణ

రణస్థలం, మే 16 (ఆంధ్రజ్యోతి)

ఆ యువకుడికి డ్యాన్స్ అంటే ఎంతో ఇష్టం. చిన్నప్పటి నుంచి టీవీలు, సినిమాల్లో డ్యాన్సులు చూసి ఆసక్తి పెంచుకున్నాడు. ఎలాగైనా డ్యాన్స్ మాస్టర్ కావాలని కలలు గన్నాడు. తనకు డ్యాన్స్ తప్ప మరో ధ్యాస లేకపోవడంతో తల్లిదండ్రులు కూడా ఆ యువకుడిపై ఇతర పనులు చేయాలని ఒత్తిడి చేయలేదు. అలాగని డ్యాన్స్‌లో ప్రోత్సహించేటంత ఆర్థిక స్తోమతా లేదు. నిరుపేద కుటుంబం కావడంతో ఆ తల్లిదండ్రులు ఏమీ చేయలేకపోయారు. కానీ ఆ యువకుడు హైదరాబాద్ వెళ్లి కష్టపడి డ్యాన్స్ నేర్చుకున్నాడు. తన కల నెరవేర్చుకున్నాడు. డ్యాన్స్ మాస్టర్ స్థాయికి ఎదిగాడు. విశాఖ, విజయవాడలో డ్యాన్స్ స్కూళ్లను ఏర్పాటుచేసి వందలాది మందికి శిక్షణ ఇస్తున్నాడు. తన కుటుంబానికి అండగా నిలుస్తున్నాడు. రణస్థలం మండలం తెప్పలవలస పంచాయతీ నీలంపేటకు చెందిన ఎంజీ సంజయ్ విజయగాథ ఇది. ఓ చానెల్‌లో ప్రసారమవుతున్న డ్యాన్స్ షోలోనూ మెరిశాడు. తొలుత బ్యాక్ గ్రౌండ్ డ్యాన్సర్‌గా గుర్తింపు సాధించాడు. దాదాపు అందరు కొరియాగ్రాఫర్ల వద్ద సహాయకుడిగా పనిచేశాడు.



గణేష్ మాస్టర్‌తో సంజయ్

పట్టుదలతో ప్రయాణం..

సంజయ్ తల్లిదండ్రులు సాధారణ వ్యవసాయ కూలీలు. కూలికి వెళ్లనిదే పూట గడవని పరిస్థితి వారిది. కుమారుడిని ప్రోత్సహించాలని ఉన్నా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. తల్లిదండ్రుల పరిస్థితిని అర్థం చేసుకున్న సంజయ్ భవిష్యత్తును వెతుక్కుంటూ హైదరాబాద్ ప్రయాణమయ్యాడు. అక్కడ సినీ స్టూడియోలు, డ్యాన్స్ అకాడమీల వద్ద పడిగాపులు కాశాడు. బున్నీ మాస్టర్ దృష్టిలో పడ్డాడు. అక్కడ ఆయనకు సహాయకుడిగా చేరాడు. ఢీ జోడీలో పాల్గొన్న వారికి బ్యాక్ గ్రౌండ్ డ్యాన్సర్‌గా సహకరించాడు. అందరికీ సుపరిచితుడయ్యాడు. అక్కడే ఉండి కొరియాగ్రఫీ అవకాశాల కోసం ఎదురుచూశాడు. డ్యాన్స్ షోలలోనూ మెరిశాడు.

ఔత్సాహికులకు శిక్షణ ఇస్తూ..

తనలానే డ్యాన్స్ అంటే ఇష్టం ఉండీ.. అవకాశాలు దక్కని వారి కోసం విజయవాడ, విశాఖలలో డ్యాన్స్ అకాడమీలు ఏర్పాటు చేశాడు. అటు తరువాత తన సొంత ప్రాంతంలో ఔత్సాహిక డ్యాన్సర్ల కోసం రణస్థలం మండల కేంద్రంలో ఎంజే డాన్స్ ఫిట్‌నెస్ స్టూడియో అకాడమీని నెలకొల్పాడు. చిన్నారుల నుంచి పెద్దవారి వరకూ డ్యాన్స్‌పై ఆసక్తి ఉన్నవారు అకాడమీలో చేరుతున్నారు. మరోవైపు కొంతమంది డ్యాన్సర్లకు సైతం ఆశ్రయం ఇస్తున్నాడు సంజయ్. ఈవెంట్లు నిర్వహిస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నాడు. ఒకనాడు కూలీకి వెళ్లనిదే ఆ కుటుంబానికి పూట గడిచేది కాదు. కానీ ఇప్పుడు డ్యాన్స్ పుణ్యమా అని కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది. కొరియాగ్రాఫర్‌గా ఉన్నత స్థాయికి చేరుకోవడమే తన లక్ష్యమని సంజయ్ చెబుతున్నాడు.

'స్వాభిమాన్'తో దివ్యాంగులకు సహకారం

● పరికరాలు అవసరమైన వారు దరఖాస్తు చేసుకోండి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమస్యలు వింటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ 'స్వాభిమాన్' ద్వారా వచ్చే వినతుల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన శుక్రవారం దివ్యాంగుల గ్రీవెన్స్ నిర్వహించారు. మొత్తం 12 మంది నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం జరిగే పబ్లిక్ గ్రీవెన్స్‌లో దివ్యాంగులు అర్జీలను సమర్పించేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అందుకే ప్రతి నెల మూడో శుక్రవారం వారి కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రీవెన్స్‌లో ఎక్కువగా ఉద్యోగాలు, పింఛన్ల కోసం అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్హతలను బట్టి వారికి వివిధ ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. అర్హులైన వారికి పింఛన్లు అందజేస్తామని భరోసా ఇచ్చారు. వీల్ ఛైర్ కావాలని వచ్చిన దివ్యాంగునికి తక్షణమే అందజేశారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సహకారంతో అలింకో సంస్థ సీఎస్ఆర్ నిధులు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో వచ్చే నెలలో సుమారు రూ.2.30 కోట్లతో వీల్ ఛైర్లు, వినికిడి పరికరాలు, మొబైల్ ఫోన్లు అందజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎవరైనా పరికరాలు అవసరం అనుకున్నవారు సంబంధిత శాఖకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఎంహెచ్ఓ డా.అనిత, దివ్యాంగుల శాఖ ఏడీ కవిత, ఉపాధి కల్పన అధికారి కె.సుధ, బీసీ కార్పొరేషన్ అధికారి గడ్డెమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అవగాహనతోనే డెంగీ నివారణ

(ఐదో పేజీ తరువాయి)

చెట్ల తొర్రలు, చిన్న చిన్న ప్రదేశాల్లో నిల్వ నీటిలో ఈ దోమలు పెరుగుతాయి. పరిసరాల పరిశుభ్రత పాటించాలి. దోమ తెరలు వినియోగించాలి. జిల్లాలో 28 గ్రామాలను మలేరియా హైరిస్క్ గ్రామాలుగా గుర్తించాం. గిరిజన ప్రాంతాల్లోని వసతిగృహాల్లో కూడా జూలై లోపు పిచికారీ పనులు పూర్తి చేస్తాం. 28 గ్రామాల్లో ప్రత్యేక బృందాలతో 5లక్షల గంబూషియా, గప్పి చేపలను నీటి నిల్వలలో విడిచిపెడతాం. వైద్యశిబిరాలు నిర్వహిస్తాం. 60 డెంగీ హైరిస్క్ గ్రామాల్లో 8 రౌండ్ల యాంటీ లార్వా ఆపరేషన్స్ చేస్తామ'ని తెలిపారు. శ్రీకాకుళం, కార్పొరేషన్, గ్రామీణ ప్రాంతాల్లో డ్రోన్లతో స్ప్రే చేయాలని ఆదేశించారు. ప్రతీ ఒక్కరూ విధిగా డ్రై డేను పాటించాలన్నారు. ఏడురోడ్ల జంక్షన్ వద్ద డెంగీ నివారణ ప్రతిజ్ఞ అందరితో చేయించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత, మలేరియా అధికారి సత్యనారాయణ, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, డా.సుధీర్‌కుమార్, సంఘ సేవకుడు మంత్రి వెంకటస్వామి పాల్గొన్నారు.

కొత్తగా 20 అగ్నిమాపక యంత్రాలు

(ఐదో పేజీ తరువాయి)

సంఘం నిధుల నుంచి వీటిని ఒక్కొక్కటి రూ.60లక్షలకు చొప్పున కొనుగోలు చేయనున్నాం. విజయనగరం జిల్లాలో నాతవలస, విశాఖలో ఎండాడ, సింహాచలం, కాపులుప్పాడ, అరకు, చింతూరు, పాడేరు ప్రాంతాల్లో అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. వీటి నిర్మాణానికి రూ.2 కోట్లు చొప్పున నిధులు మంజూరు చేస్తున్నాం. సోంపేట, బొబ్బిలి, పాలకొండ, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరంలో శిథిలావస్థకు చేరుకున్న ఫైర్‌స్టేషన్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు చేపడతామ'ని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారి సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీ సర్వే చేయండి

● ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సమక్షంలో రీసర్వే చేయడం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. కనిమెట్ట గ్రామంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో సర్కారు భూములు, అమాయకుల భూములు దోచుకునేందుకు రైతులు లేకుండానే నాయకులు రీసర్వే చేసేలా అధికారులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. దీని వల్లనే భూ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. వివాదాలు, సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే సరిహద్దు రైతులందరి సమక్షంలోనే రీసర్వే చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించిందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరించి రైతులకు పూర్తి న్యాయం చేస్తామన్నారు. సకాలంలో రీస్వే పూర్తిచేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.వెంకటేష్, ఎంపీటీసీ కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ అన్నెపు శ్రీను, సర్వే, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకూ.. కదలిక

(ఐదో పేజీ తరువాయి)

రెండు పాయింట్లు, కేటగిరీ-3 గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి ఏడాదికి మూడు పాయింట్లు, కేటగిరీ-4 మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి ఏడాదికి ఐదు పాయింట్లు కేటాయిస్తారు.

● ఉపాధ్యాయులు పనిచేసిన మొత్తం కాలానికి సంవత్సరానికి 0.5 పాయింట్లు.

● భార్యభర్తలు ప్రభుత్వ ఉద్యోగులు/ఉపాధ్యాయులు అయితే వారికి ఐదు పాయింట్లు కేటాయిస్తారు. భార్యాభర్తల్లో ఒకరికి మాత్రమే ఇవి వర్తిస్తాయి. అయితే భార్య లేదా భర్త దగ్గరకు బదిలీ కోరుకోవాల్సి ఉంటుంది. భార్య లేదా భర్త ఇద్దరూ తప్పనిసరిగా బదిలీ కావాల్సి వస్తే ఒకరికి మాత్రమే ఈ పాయింట్లు వర్తిస్తాయి.

● అవివాహిత మహిళా టీచర్లకు ఐదు పాయింట్లు.

● 40 నుంచి 55 శాతం వరకు శారీరక వైకల్యం ఉన్నవారికి, 60శాతం నుంచి 70శాతం వినికిడి లోపం ఉన్న వారికి ఐదు పాయింట్లు.

● 40 శాతం దృష్టిలోపం ఉన్నవారికి, 56 నుంచి 59 శాతం శారీరక వైకల్యం గల వారికి ఏడు పాయింట్లు.

● ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు ఐదు పాయింట్లు.

● విడాకులు తీసుకున్న మహిళలు(మళ్లీ పెళ్లి చేసుకోనివారు) ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీపీఎస్ఎఫ్‌లో పనిచేసి ప్రస్తుతం టీచర్లుగా పనిచేస్తున్న వారికి ఐదు పాయింట్లు.

● రెండేళ్లుగా పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ నిర్వహిస్తున్న వారికి ఐదు పాయింట్లు.

● పునర్విభజనలో తప్పనిసరిగా బదిలీ అయ్యేవారికి ఐదు పాయింట్లు కేటాయిస్తారు.

నెగిటివ్ పాయింట్లు..

టీచర్ల బదిలీల్లో మొదటిసారిగా నెగిటివ్ పాయింట్లు ప్రవేశపెట్టారు. అధికారుల అనుమతి లేకుండా అనధికారకంగా విధులకు గైర్హాజరైన టీచర్లకు నెలకు ఒక పాయింట్ చొప్పున గరిష్ఠంగా 10 నెగిటివ్ పాయింట్లు తీసివేస్తారు. వీరిపై క్రమశిక్షణ చర్యలు కూడా ఉంటాయి.

● బదిలీల్లో ఇద్దరు ముగ్గురు టీచర్లకు ఒకే ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లు వస్తే సర్వీసులో సీనియార్టీకి మొదటి ప్రాధాన్యత, ఒకే సర్వీసు ఉంటే పుట్టిన తేదీని బట్టి మహిళా టీచర్లకు ఆ తర్వాత ప్రాధాన్యత లభిస్తుంది.

కల్యాణం... కమనీయం

● ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వర స్వామి, పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న రుత్వికులు

నరసన్నపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి సూర్యప్రభ వాహనంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణం, పండిత సత్కారం చేపట్టారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దంపతులు పాల్గొన్నారు. జోస్యుల జగన్నాథశర్మ, మావుడూరు జగదీష్‌బాబు, చామర్తి సత్యసాయి కృష్ణమాచార్యులు, జోస్యుల సుందరి వేణుగోపాలశర్మ, చామర్తి శ్రీనివాసచార్యులు, రేజేటి శ్రీరామచార్యులు, అప్పలచార్యులు ఈ క్రతువు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు



అపురూపం.. ఈ మూగజీవుల బంధం

కామధేనువుగా పిలుచుకునే ఆవు... విశ్వాసానికి మారు పేరుగా నిలిచే శునకం... ఈ రెండూ వేర్వేరు జాతులు. కానీ ఐక్యతగా ఉంటూ... చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పెంట గ్రామంలోని ఓ రైతుకు చెందిన గోమాత తన వద్దకు వచ్చిన శునకాన్ని ప్రేమగా నాలుకతో నిమురుతూ ప్రేమను పంచుతోంది. శునకం సైతం ఆవు దగ్గర దూడలా ఒదిగిపోతోంది. వీటి మూగబంధాన్ని చూసి.. జనం ముచ్చట పడుతున్నారు.

-జి.సిగడాం, మే 16 (ఆంధ్రజ్యోతి)

26 నుంచి కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల, మే 16(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో కారు డ్రైవింగ్‌లో ఈ నెల 26వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎన్.రాంజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19-45 ఏళ్ల లోపు గల పదో తరగతి విద్యార్హత ఉన్న యువకులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఎల్‌ఎంవీ కారు డ్రైవింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణతో పాటు భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ పొందే యువకులకు ఫోర్ వీలర్ ఎల్ఎల్ఆర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 7993340407, 9553410809 సంప్రదించాలన్నారు.

మునిసిపల్ కార్మికుల సమ్మె వాయిదా

ఇచ్ఛాపురం, మే 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలను నిరసిస్తూ ఈ నెల 20న తలపెట్టిన సమ్మెను వచ్చే నెల 9వ తేదీకి వాయిదా వేసినట్టు మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్ పట్నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మునిసిపల్ రంగంలో ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, బిడ్డలకు ఉద్యోగాలు తదితర సమస్యల పరిష్కారం కోసం సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 రెండు రోజులపాటు తలపెట్టిన సమ్మెకు సంబంధించి ఇప్పటికే డీఎంఏ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై ఈనెల 13న జాయింట్ మీటింగ్ జరిపారని తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర కార్మిక సంఘాలు సమ్మె వాయిదా వేసినట్టు నిర్ణయించామన్నారు.

నాట్య గురువు దివ్య దూరదర్శన్‌లో ప్రదర్శన


దివ్య

ఇచ్ఛాపురం, మే 16(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీస్వేచ్ఛా నృత్య తరంగణి కూచిపూడి భరతనాట్యం, జానపద నాట్య శిక్షణాలయం నాట్య గురువు మంగి దివ్యకు దూరదర్శన్ బీ-హైగ్రేడ్ ఓటీలో ప్రదర్శనకు అవకాశం లభించిందని శిక్షణాలయ అధ్యక్షుడు గోవింద్ తెలిపారు. దూరదర్శన్ యాదగిరి చానల్ (హైదారాబాద్) నిర్వహించే పోటీలకు ఎంపిక చేశారన్నారు. శుక్రవారం జరిగిన ఈ పోటీల్లో పాల్గొన్న నాట్య గురువు దివ్య 14 నిమిషాల పాటు నాట్య ప్రదర్శన ఇచ్చినట్టు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి దూరదర్శన్ బీ హైగ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తింపు పత్రాన్ని అందజేస్తుందన్నారు.

వైసీపీ హయాంలోనే బియ్యం పక్కదారి

ఆమదాలవలస, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ ఐదేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం హయాంలో కొత్త రేషన్‌కార్డులు మంజూరు జరుగుతుందని రిటైర్డ్ తహసీల్దార్, టీడీపీ నాయకుడు పేడాడ జనార్దనరావు అన్నారు. బుధవారం శ్రీహరిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్డుల మంజూరుకు అవసరమైన దరఖాస్తుల ప్రక్రియను ఈ నెల 8న ప్రారంభమైందన్నారు. కొత్తరేషన్ కార్డులు, మార్పులు, చేర్పులు, విభజన, కార్డుల అప్పగింత, చిరునామా మార్పు, ఆధార్ అనుసంధానంలో తప్పుల సవరణ వంటి ఆరు ప్రధాన అంశాలతో కొత్తగా స్మార్ట్‌కార్డులు జారీ కానున్నాయన్నారు. దీనివల్ల లక్షలాది మందికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే బియ్యం కూడా లభిస్తాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బియ్యం కుంభకోణంలో మునిగిపోగా.. కూటమి ప్రభుత్వం కార్డులు మంజూరు చేస్తూ పేదలను ఆదుకుంటుందన్నారు. టీడీపీ నాయకులు కూన అప్పలనాయుడు, కిల్లి శేషు, చింతాడ బలరామ్ ప్రసాద్, సీపాన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మపూర్ రైలుకు హాల్టింగ్ ఇవ్వండి

ఇచ్ఛాపురం, మే 16(ఆంధ్రజ్యోతి): బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలుకు జాడుపూడి, బారువా స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని ఎడీఆర్ఎం పీకే బెహరాకు జడ్ఆర్ యూసీసీ మెంబర్ శ్రీనివాస్ రౌలో, డీఆర్‌యూసీసీ మెంబర్ కట్టా సూర్యప్రకాష్ కోరారు. ఈమేరకు శుక్రవారం ఖుర్దా రోడ్ డీఆర్ఎం కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ రైలు ఈ రెండు స్టేషన్లలో హాల్టింగ్ కల్పిస్తే రైల్వే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని దీంతో పాటు రైల్వేకు ఆదాయం కూడా పెరుగుతుందని తెలిపారు. దీనితోపాటు కొత్తగా మంజూరైన 12రోడ్ ఓవర్ బ్రిడ్జీలు, రెండు రోడ్ అండర్ బ్రిడ్జీల పనులు త్వరగా ప్రారంభిం చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌యూ సీసీ మెంబర్ కట్టా సూర్యప్రకాష్, చక్కా గోపాల్ పాల్గొన్నారు.

క్వారీలో ఏమైంది?

(ఐదో పేజీ తరువాయి)

క్వారీ వద్దకు వచ్చేలోపు మృతదేహాలను ఒక వ్యాన్‌లో వేసి కొండపై నుంచి కిందకు దింపేశారు. దీంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి గ్రానైట్ యజమానితో వాగ్వాదానికి దిగారు. పిడుగు పడి వారు మృతి చెందలేదని, బాంబు బ్లాస్టింగ్ అయి ప్రాణాలు కోల్పోయి ఉంటారని ఆరోపించారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా.. పాతపట్నం సీఐ రామారావు, ఎస్ఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను సముదాయించారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేసిన తర్వాత ఘటన ఎలా జరిగిందో తెలుస్తుందని వారికి నచ్చజెప్పారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనుమానాలెన్నో..

పిడుగు పడి మృతి చెందితే శరీర భాగాలు విడిపోవు. కానీ ఆ ముగ్గురి మృతదేహాలు ఛిద్రంగా కనిపించడంతో ఈ ఘటన ఎలా జరిగిందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. పిడుగు పడి మృతి చెందితే.. పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలి. కానీ అలా కాకుండా మృతదేహాలను కుటుంబ సభ్యులు రాకముందే కొండపై నుంచి కిందకు దించడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రానైట్ క్వారీల్లో రాయిని విడగొట్టేందుకు కొన్ని సందర్భాల్లో బాంబులు అమర్చి పేల్చుతుంటారు. బాంబు బ్లాస్ట్ అయ్యే సమయంలో పక్కనే ఉన్న ఈ ముగ్గురికీ రాళ్లు తగిలి మృతి చెంది ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఛిద్రమైన మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఉపాధి కోసం క్వారీకి వెళితే.. కానరాని లోకాలకు తరలిపోయారంటూ రోదించారు. ఇక తమకు దిక్కెవరని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ఘటనతో పోలవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నమ్మండి.. ఇది శ్వేతపుష్కరిణే!

- నీళ్లు, పరిసరాలు కలుషితమే..
- స్థానికుల స్నానాలూ ఇక్కడే..
- అపరిశుభ్రంగా ప్రసిద్ధ కూర్మక్షేత్రం


చెత్తా, చెదారంతో కలుషితమైన శ్వేతపుష్కరిణి నీళ్లు

గార, మే 16(ఆంధ్రజ్యోతి): శ్రీమహావిష్ణువు దశావతారాల్లో రెండోది కూర్మనాథుడు వెలసిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మం దేవస్థానం. ఈ ఆలయానికి దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. తొలుత ఆలయ శ్వేత పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి, పెద్దలకు పితృ తర్పణాలు సమర్పించిన అనంతరం స్వామివారిని దర్శించుకుంటారు. కానీ ఇక్కడ పవిత్ర అష్టతీర్థాల్లో అత్యంత ప్రధానమైన తీర్థంగా పేరుగాంచిన శ్వేతపుష్కరిణి అధ్వానంగా తయారైంది. వాస్తవానికి ప్రతి రోజైె ఉదయాన్నే ఈ పుష్కరిణి నుంచి నీటిని కలశంతో తీసుకువెళ్లి అర్చకులు స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యార్చన చేస్తుంటారు. కానీ శ్వేతపుష్కరిణి పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయి, అపరిశుభ్రంగా తయారయ్యాయి. పవిత్రమైన పుష్కరిణి జలాలు కలుషితమవుతుండడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పుష్కరిణికి రెండు మెట్ల మార్గాలు ఉన్నాయి. ఒకటి ఆలయానికి ఎదురుగా తూర్పు ముఖంగా, మరొక మార్గం ఆలయం వెలుపల ఉంది. ఇక్కడే పితృదేవతలకు పిండ తర్పణం వంటి కార్యక్రమాలను నిత్యమూ చేపడుతుంటారు. పితృకార్యాలు అనంతరం వదిలేసిన ఆహార పదార్థాలు, విస్తరాకులు, ఇతర చెత్తాచెదారంతో పరిసరాలు నిండిపోయి, దుర్వాసన రావడమే కాకుండా, భక్తులు ఇక్కడ స్నానాలు చేయడానికి ఏమాత్రం అనువుగా లేకుండా పోయింది. ఇక్కడి నీరు పూర్తిగా ఆకుపచ్చ రంగులోకి మారిపోయి, జలాల్లో చెత్త తేలుతూ, దుర్వాసన వెదజల్లుతోంది. పుష్కరణి వద్ద ఇక్కడ వేసిన గ్రిల్స్ కూడా పాడైపోయాయి. చెత్తను క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఈ విషయంలో సంబంధిత అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడంపై స్థానికులు, భక్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పుష్కరిణి పరిసరాలు శుభ్రం చేసి, భక్తుల పవిత్ర స్నానాలకు అనువుగా తయారు చేయాలని, ఆలయ ప్రతిష్టను కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

శుభ్రం చేయిస్తాం

శ్వేతపుష్కరిణి నీటిని శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకుంటాం. పరిసరాల్లోని చెత్తను తొలగించి, భక్తులను ఆహ్లాదకరంగా ఉండేలా చూస్తాం.

\- కె.నరసింహనాయుడు, ఆలయ ఈవో

మినీ మహానాడును విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఎచ్చెర్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఈ నెల 20న నిర్వహించే మినీ మహానాడును విజయవంతం చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. చిలకపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మినీ మహానాడు ఏర్పాట్లు, సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై శుక్రవారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ మహానాడు కార్యక్రమం నియోజకవర్గంలో ఆర్భాటంగా జరిగాలని, రాష్ట్రం మొత్తం మనవైపు చూసేలా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నాయకులు బెండు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్, లంక శ్యామ్, పైడి ముఖలింగం, గూరు జగపతిబాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎంపీ ప్రజా దర్బార్‌ను నిర్వహించి వినతులను స్వీకరించి, అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి చొరవ చూపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


యంత్ర పరికరాల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, మే 16(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎంఏఎం, ఎఫ్ఎన్ఎస్ పథకం ద్వారా రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే సమర్థుడైన చంద్రబాబులాంటి ముఖ్యమంత్రి ఉండాలని, సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా నడిపిస్తున్నారని కొనియాడారు. తొందరలోనే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నిధులు జమకానున్నాయన్నారు. అనంతరం రైతులకు యంత్ర పరికరాలను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పేరుకట్ల విశ్వప్రసాద్, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చం ద్రశేఖర్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బొసెల అప్పారావు, వ్యవసాయశాఖ జేడీ కె.త్రినాధస్వామి, ఏడీ బగ్గు రజని, ఏవో మెట్ట మోహన్‌రావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంశధార జలాల తరలింపుపై హర్షం


ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఇచ్ఛాపురం, మే 16(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో నీటి ఎద్దడి పరిష్కరించేందుకు వంశధార నదీ జలాలను తరలించేందుకు కృషి చేసిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు టీడీపీ సీనియర్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు శుక్రవారం పట్టణంలో ర్యాలీ చేపట్టారు.

పీఏసీఎస్ స్థల ఆక్రమణపై అధికారుల సర్వే


పీఏసీఎస్ స్థలంలో సర్వే చేస్తున్న అధికారులు

పొందూరు, మే 16(ఆంధ్రజ్యోతి): పొందూరు పీఏసీఎస్ స్థల ఆక్రమణపై శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. పొందూరు పీఏసీఎస్‌కు పొందూరు మేజరు పంచాయతీ పరిధి జోగన్నపేట గ్రామం వద్ద 23.5 సెంట్ల స్థలం ఉంది. స్థలానికి సంబంధించి అన్ని రకాల డాక్యుమెంట్లు పీఏసీఎస్ యాజమాన్యం వద్ద ఉన్నాయి. ఈ స్థలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 8 సెంట్లు స్థలం ఆక్రమించారు. ఇక్కడ సెంటు స్థలం రూ.7 నుంచి రూ.8 లక్షలు ఉంటుంది. ఇటీవల మండల పరిషత్ సమావేశంలో ఆక్రమణపై ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. రవికుమార్ స్పందిస్తూ తక్షణమే ఆక్రమణ స్థలంలో ఉన్న అరటి చెట్లను తొలగించి స్థలాన్ని పీఏసీఎస్‌కు అప్పగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అవసరమైతే పోలీసు భద్రత తీసుకోవాలని పీఏసీఎస్ సీఈవో పాపినాయుడును ఆదేశించారు. సర్వే నిర్వహించి ఆక్రమణ స్థలం పీఏసీఎస్‌కు చెందినదని గుర్తించి తహసీల్దార్‌కు నివేదిక ఇచ్చారు. ఈ సర్వేపై ఎమ్మెల్యే రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేచేసి ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం ఎందుకు చేసుకోలేదని రెవెన్యూ, పీఏసీఎస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సర్వేలో సర్వేయర్ గణపతి, ప్రసాద్, శ్రావ్య, పీఏసీఎస్ సీఈవో పాపినాయుడు తదితరులు ఉన్నారు. పొందూరు పట్టణం పరిధిలో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. కాగా ఇటీవల 198, 241, 6-3, 173 సర్వే నంబర్లలో విలువైన శాలిహుండం ట్రస్టు భూముల ఆక్రమణపైనా ట్రస్టు చైర్మన్ మధురెడ్డి ఎమ్మెల్యే రవికుమార్, రెవెన్యూ, దేవదాయ, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైతుల ఆత్మహత్యలు పట్టడం లేదు


మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక సభ్యులు

కంచిలి, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కౌలు రైతుల ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మానవ హక్కుల వేదిక, రైతు స్వరాజ్య వేదిక సభ్యులు విమర్శించారు. పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన కౌలు రైతు బల్లెడ నర్సింహమూర్తి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బృందం సభ్యులు వీఎస్ కృష్ణ, కె.ప్రధాన్, తామాడ అరుణ, బాలు గోడి, కేవీ జగన్నాథం, బీసీ హక్కుల ప్రతినిధి బీన డిల్లీరావు శుక్రవారం పెద్దకొజ్జిరియాలో మృతి చెందిన రైతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకుంటే, ఇంతవరకు ప్రభుత్వం అతడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఎక్కడైనా రైతు ఆత్మహత్య చేసుకుంటే, వెంటనే త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి, నివేదికను కలెక్టర్‌కు పంపించాల్సి ఉందన్నారు. కానీ నర్సింహమూర్తి మృతి చెంది 36 రోజులు గడిచినా, జిల్లాకు చెందిన మంత్రి త్రిసభ్య కమిటిని ఎందుకు వేయలేదన్నారు. 2020లో ప్రభుత్వం ఇచ్చిన 43 ప్రకారం రైతు ఆత్మహత్య చేసుకుంటే, బాధిత కుటుంబానికి ఏడు లక్షల రూపాయల నష్ట పరిహారం అందించాలన్నారు. బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రణస్థలం, మే 16(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం ధ్యే యమని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు పిన్నింటి భానోజీనాయుడు అన్నారు. శుక్రవారం నగరప్పాలెం గ్రామంలో పలు వీధులకు సీసీ రోడ్ల నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. పార్టీలకు అతీతంగా ఈ ప్రభుత్వం పథకాలు అర్హులకు అందచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరిమజ్జి భాస్కరరావు, ఎంపీటీసీ కరిమజ్జి రమణ, కలిశెట్టి భద్రయ్య, రౌతు రమణ, కరిమజ్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'

గార, మే 16(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలో శనివారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొనున్నట్టు తెలిపారు. అందువల్ల అధికారులంతా హాజరు కావాలని ఆదేశించారు.

నిబంధనలు పాటించండి

సరుబుజ్జిలి, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లెకు మంజూరు చేస్తున్న పక్కా రహదారుల నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం అలికాం-బత్తిలి ప్రధాన రహదారి నుంచి కొత్తకోట గ్రామానికి ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.47 కోట్లతో చేపట్టనున్న రహదారి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్య క్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పేరుకట్ల విశ్వప్రసాద్, టీడీపీ నాయకులు పల్లి సురేష్, అంబళ్ల రాంబాబు, తర్లాడ సురేంద్ర, సర్పంచ్ సురవరపు జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి

ఆమదాలవలస, మే 16(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని పెన్షనర్ల సంఘ అధ్యక్ష కార్యదర్శులు సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణలో ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వీరితోపాటు కోశాధికారి హెచ్‌వీ సత్యనారాయణ, రిటైర్డు తహసీల్దార్ జల్లేపల్లి రామారావు, సంఘ నాయకులు డి.లక్ష్మణరావు, ఆర్.సత్యనారాయణ, బీవీ రమణ, బి.సూర్యనారాయణ, కె.షన్ముఖరావు, పి.భానోజీరావు, డి.శ్రీరామ్మూర్తి తతదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా సరిత

జి.సిగడాం, మే 16 (ఆంధ్రజ్యోతి): జి.సిగడాం తహసీల్దార్‌గా ఎం.సరిత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నరసన్నపేట తహ సీల్దార్ కార్యాలయంలో డీటీగా పని చేసిన ఈమె పదోన్నతిపై తహసీ ల్దార్‌గా బదిలీపై వచ్చారు. రెవెన్యూ సిబ్బంది ప్రత్యేకం గా అభినందనలు తెలిపారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఎం.శ్రీకాంత్ మందస బదిలీపై వెళ్లారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

ఎచ్చెర్ల, మే 16(ఆంధ్రజ్యోతి): పొన్నాడ పంచాయతీ వెంకన్న గారిపేట గ్రామంలోని వీధుల్లో విద్యుత్ వైర్లు వేలాడుతుండడం తో ప్రజలు ఆం దోళన చెందుతున్నారు. ఈ గ్రామంలోని వీధుల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు కిందకి ఉండడంతో ప్రజలు భయపడుతున్నారు. అదనపు స్తంభాలు ఏర్పాటు చేయాలని, 24 గంటల పాటు త్రీ ఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

సోంపేట, మే 16(ఆంధ్రజ్యోతి): కొర్లాం పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని సర్పంచ్ రాంబుడ్డి రమణమ్మ కోరారు. పంచాయతీ పరిధిలోని హంకంపేట, బ్రాహ్మణకొర్లాం, గొనకపాడు, లక్ష్మీపురం, నూకలూరు గ్రామాలకు గత 15రోజులుగా నీరు రాకపోవడంతో నీటి ఎద్దడి నెలకొందన్నారు. మరమ్మతుల పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారని, వచ్చేవారం సంబరాల నేపథ్యంలో నీటిసరఫరా చేయాలని కోరారు.

దరఖాస్తులు పరిశీలన

లావేరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏడాది ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న స్వయం ఉపాధి రుణాల కోసం ఇటీవలన దరఖాస్తులు చేసిన అభ్యర్థులకు చెందిన దరఖాస్తులను శుక్రవారం లావేరు ఎంపీడీవో కార్యాలయంలో పరిశీలించారు. మండల పరిషత్ పర్యవేక్షకులు సుజాత లావేరు, ఆదపాక బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వనరుల కల్పనపై సమీక్ష

పొందూరు, మే 16(ఆంధ్రజ్యోతి): సాగునీటి వనరుల కల్పనకు ఎన్ఆర్ఈజీఎస్ వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల సౌజన్యంతో చెక్‌డ్యామ్, ఫాంపాండ్స్ వంటి పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు తహసీల్దార్ ఆర్.వెంకటేష్, ఎంపీడీవో మన్మథ రావు, మండల టీడీపీ అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఏపీవో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

శిశు మరణాల నివారణపై దృష్టిసారించండి



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శిశు మరణాల నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన శిశు మరణాలకు గల కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత 4 నెలల్లో జరిగిన 12 శిశు మరణాలు గురించి బెలగాం, బొంతు, గుత్తావల్లి, రావాడ, సింగుపురం, మెళియాపుట్టి, నందిగాం, నౌగాం, నౌపడ, తురకపేట, లింగాలవలస, యూపీహెచ్‌సీ ఫాజుల్‌బాగ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలతో మాట్లాడి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భి ణీ, బాలింతల సంరక్షణపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంహెచ్‌వో కె.అనిత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రాందాస్, ప్రోగ్రామ్ అధికారులు, డీపీహెచ్‌వో శైలజ, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్‌గా జగదీష్


జగదీష్‌ను అభినందిస్తున్న దృశ్యం

గుజరాతీపేట. మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్‌గా ఎస్‌వీఎస్ జగదీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు విజయవాడలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అందులో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్వీఎస్ జగదీష్‌తోపాటు ప్రధాన కార్యదర్శి ఎం.రంగబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్‌వీ సత్యనా రాయణ, సలహాదారులుగా డి.వరప్రసాద్ ఎన్నికయ్యారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

రణస్థలం, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని ఏఎల్ఎస్‌వో కోఆర్డినేటర్ జనార్దనరావు అన్నారు. సకాలంలో విద్యార్థులకు పంపిణీ చేస్తూ మెరుగైన విద్యను ప్రభుత్వం అందిస్తుందన్నారు.

అదుపు తప్పి.. టైర్ల కిందకు దూసుకుపోయి

● గడ్డెయ్యపేట వద్ద రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సమీర్(ఫైల్)

నరసన్నపేట, మే16(ఆంధ్రజ్యోతి):మండలంలోని జమ్ము పంచాయతీ గడ్డెయ్యపేట వద్ద అంతర్రాష్ట్ర జాతీయరహదారిపై శుక్రవారం ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో యువకుడు మినీ వ్యాన్ టైర్ల కిందికి దూసుకుపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలుకావడంతో అక్కడక్కడే మృతిచెందాడు.స్థానికులు,పోలీసుల కథనం మేరకు..నరసన్నపేట మండలంలోని జమ్ములో బంధువుల ఇంటి నుంచి సారవకోట మండలంలోని బురద కొత్తూరుకు చెందిన కరజాన సమీర్ (22) ద్విచక్రవాహనంపై హిరమండలం మండలంలోని కలట గ్రామం వెళ్తున్నాడు. గడ్డెయ్యపేట వద్ద మరో ద్విచక్రవాహనం క్రాస్ చేస్తున్నాడు. ఆ సమయంలో ఆ ద్విచక్రవాహనం ముందుభాగానికి సమీర్ ద్విచక్రవాహనం హ్యాండిల్ తగలడంతో అదుపుతప్పింది. దీంతో సమీర్ రోడ్డుపై పడి అక్కడ పార్కుచేసిన మినీ వ్యాన్ వెనుక టైర్ల కిందకు చేరాడు. దీంతో తలకు బలమైన గాయాలుకావడంతో అక్కడక్కడే మృతిచెందాడు. సమీర్ నడిపే ద్విచక్రవాహనం 300 మీటర్ల దూరం వరకు ముందుకు దూసుకువెళ్లింది. దీంతో మరో ద్విచక్రవాహనం నడుపుతున్న చౌదరికి గాయాలు కావడంతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు.సమీర్ పొందూరులో ఓ శుభకార్యాక్రమానికి హాజరై జమ్ము తన మేనమామ ప్రశాంత్ ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో ఈప్రమాదం జరిగింది. కుమారుడు మృతిచెందడంతో తండ్రి శ్రీనివాసరావు, తల్లి బుజ్జమ్మ, అక్క స్వర్ణలత, తమ్ముడు శ్యామలరావు లబోదిబోమని రోదిస్తున్నారు. సమీర్ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎస్‌ఐ దుర్గాప్రసాద్ సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదుచేశారు. ద్విచక్రవాహనం సమీర్ అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

పాతపట్నం, మే 16(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎన్‌పేట మండలంలోని రావిచంద్రికి చెందిన చింత రామినాయుడు(65)చికిత్సపొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు..కమలమ్మకొట్టు కూడలి వద్ద ఆగిఉన్న మోటార్‌సైకిల్‌పై ఉన్న ముగ్గురు వ్యక్తులను ఈనెల 14వ తేదీ రాత్రి కారు ఢీకొంది.దీంతో గాయపడిన చింత రామినాయుడును పాతపట్నం 50 పడకల సామాజిక ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. వైద్యాధికారుల సిఫారసు మేరకు శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత పొందుతూ మృతిచెందాడు.రామినాయుడుసోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.లావణ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

శ్రీకూర్మంకు చెందిన యువతి...

భోగాపురం, మే16(ఆంధ్రజ్యోతి):విజయనగరం జిల్లాలోని భోగాపురం జాతీయరహదారిపై అక్కివరం జంక్షన్ సమీపంలో ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకూర్మం గ్రామానికి చెందిన హేమలత(19) శుక్రవారం మృతిచెందినట్టు ఎస్‌ఐ పాపారావు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. అక్కివరం జంక్షన్ సమీపంలో ఈనెల పదోతేదీన ద్విచక్రవాహనం జాతీయరహదారిపై డివైడర్‌ను ఢీకొనడంతో ముగ్గురుగాయపడ్డారు. ఇందులో హేమలత శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఇచ్ఛాపురం, మే 16(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారి బెల్లుపడ పాత టోల్ ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కంచిలి మండలానికి చెందిన సుశాంత్ ప్రధాన్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం సుశాంత్ ప్రధాన్ కంచిలి నుంచి బైక్‌పై బరంపురంలో బయలు దేరాడు. ఇచ్ఛాపురం మునిసిపాల్టీ పరిధి బెల్లుపడ పాత టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి బైక్ అదుపతప్పి జాతీయ రహదారిపై ఉన్న సేఫ్టీరాడ్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బరంపురం తరలించారు. అతడి భార్య భవాని ప్రధాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌ఐ ముకుందరావు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

రణస్థలం, మే 16(ఆంధ్రజ్యోతి):కొచ్చెర్ల పంచాయతీ కొరవానిపేట సమీప తీరంలోని ఒక తోటలో శుక్రవారం జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసున్నారు. వీరినుంచి రూ.12,400, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నాలుగు పూరిళ్లు దగ్ధం

లావేరు, మే16(ఆంధ్రజ్యోతి):మురపాకలో శుక్రవారం విద్యుత్‌షార్టు సర్క్యూట్‌తో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామంలోని చాలామంది ఉపాధి పనికి వెళ్లే సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో లావేటి లక్ష్మి, రాములమ్మ, మామిడి ఈశ్వరరావు, గార రాములమ్మకు చెందిన పూరిళ్లు దగ్ధమవ్వగా..బాధితులంతా కట్టుబట్టలతో మిగిలారు. సర్పంచ్ పెయ్యిల లక్ష్మణరావు బాధిత కుటుంబాలను పరామర్శించి, బియ్యంతోపాటు కొంత నగదు అందించారు. ఎస్‌ఐ లక్ష్మణరావు పరిశీలించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

లావేరు, మే 16(ఆంధ్రజ్యోతి): పెద్దకొత్తకోట ఎస్సీ కాలనీలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని శుక్రవారం అరెస్టుచేసినట్లు జేఆర్‌పురం సీఐ అవతారం, లావేరు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. పెదకొత్తకోట ఎస్సీ కాలనీలోని యాడాడ లక్ష్మి ఇంటిలో ఈనెల 3న దొంగతనం జరిగింది. ఈ ఘటనలో మూడుతులాల బంగారు ఆభరణాలు, సామగ్రి చోరీకి గురయ్యాయి. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో విచారణ చేపట్టి, చోరీకి పాల్పడిన అదపాక గ్రామానికి చెందిన పిన్నింటి చంద్రరావును అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఆయన నుంచి బంగారు ఆభరణాలు, సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

బస్సు టైరు దిగబడి.. రాకపోకలకు అంతరాయం

పాతపట్నం, మే 16(ఆంధ్రజ్యోతి):స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఎదుట ఓ బస్సు దిగబడిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటీవల బీఎస్‌ఎన్‌ఎల్ సిబ్బంది తమ కార్యాలయం నుంచి నేషనల్ హైవే మార్గానికి వైర్లు కనెక్షన్ ఇచ్చేందుకు గోతులు తవ్వి పూడ్చారు. అయితే గోతులు పూడ్చినా శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఆ గొయ్యి కుమిలిపోయింది.దీంతో బస్సు టైరు దిగిపోవడంతో పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో , హౌసింగ్‌బోర్డు కార్యాలయాలకు వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు: ఎస్పీ

పలాస, మే 16(ఆంధ్రజ్యోతి):ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదులను చట్టపరిధిలో విచారణ నిర్వహించి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఫిర్యాదుదారుల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి అందించాలని కాశీబుగ్గ పోలీసులకు ఆదేశించారు.

వడదెబ్బతో హెడ్‌కానిస్టేబుల్‌కు అస్వస్థత

కాశీబుగ్గపోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యుగంధర్ శుక్రవారం బందోబస్తు నిర్వహిస్తుండగా వడదెబ్బతగిలి అస్వస్థతకు గురయ్యాడు. ఆయన్ను కానిస్టేబుళ్లు హుటాహుటిన పలాస ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి చికిత్సపొందుతున్న యుగంధర్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని వైద్యాధికారులను సూచించారు. వయసు ప్రాతిపదికన సిబ్బందికి విధుల్లో వెసులుబాటు కల్పించాలని సీఐ పి.సూర్యనారాయణకు ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సిబ్బంది ఉన్నారు.

బిల్లులు చెల్లించక.. పనులు కాక

● ప్రమాదాల బారిన పడుతున్న వాహనచోదకులు ● ఇదీ అక్కుపల్లి- బెండిరోడ్డులో దుస్థితి


చినవంక వద్ద పనులు నిలిచిపోవడంతో రాళ్లు తేలిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

వజ్రపుకొత్తూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి- బెండి రోడ్డుకు సంబంధించి బిల్లులు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో రాళ్ల తేలడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. దీనికితోడు పనులు నిలిచిపోవడం వల్ల దుమ్మూ, దూళి వల్ల రోడ్డుకు ఇరువైపులా ఉండేవారంతా అగచాట్లకు గురవుతున్నారు.

అక్కుపల్లి- బెండిరోడ్డు పనులు 2021 లో రూ.18 కోట్లతో ప్రారంభించారు. తర్వాత రూ.ఎనిమిది కోట్ల మేర పనులు చేసినా బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందిపడుతున్నారు. విస్తరణ పేరుతో వైసీపీ ప్రభుత్వం రోడ్డుపై రాళ్లవేసి విడిచిపెట్టడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారంతా అగచాట్లకు గురవుతున్నారు. రోడ్డు పనులకు కనీసం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశారు. సుమారుగా మూడేళ్ళు గడుస్తున్నా పనులు ముందుకు సాగకపోవడంతో ఈరోడ్డుపై ప్రయాణించే ద్విచక్రవాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురై పల్టీలు కొడుతుండడంతో పలువురు గాయాలపాలవుతున్నారు. ఈ మార్గంలో ధర్మపురం వద్ద వాహనం పల్టీకొట్టడంతో గాయపడిన ఓ మహిళా చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. పనులు మూడేళ్లుగా నిలిచిపోవడంతో అడుగడుగునా రాళ్లతేలాయి.

అక్కుపల్లి- బెండి రోడ్డును ఇంజనీర్లు రోడ్డును ఇటీవలే పరిశీలించినట్లు ఆర్‌అండ్‌బీ జేఈ జగదీష్ తెలిపారు. ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన తరువాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆర్‌అండ్‌బీ తరఫున అక్కుపల్లి- బెండిరోడ్డుపై నివేదిక అందించామన్నారు.

మరమ్మతులు లేక.. అధ్వానంగా మారి

● ఇదీ కేదారిపురం నుంచి చినంచల రహదారి దుస్థితి


టెక్కలిపట్నం వద్ద రోడ్డు మధ్యలో పెద్దపెద్ద గోతులు ఏర్పడిన దృశ్యం

పలాస రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేదారిపురం నుంచి చినంచల వెళ్లే రహదారి ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధ్వానంగా మారింది. అడుగడుగునా గోతులమయం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఈదురాపల్లికి వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు పెచ్చులూడింది. కంకర బయటకు రావడంతో చీకటిపడిన తర్వాత వచ్చిపోయే వాహనాలు పల్టీలు కొడుతున్నాయి. గంగువాడ నుంచి చినంచలకు వెళ్లే రహదారిలో గంగువాడ వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు మధ్యలో గోతులు ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతు లకు చర్యలు తీసుకో వాలని పలువురు కోరుతున్నారు.

పెచ్చులూడి.. రాళ్లు తేలి

● ఇదీ టెక్కలిపట్నం రోడ్డు పరిస్థితి

పలాస మండలంలోని టెక్కలిపట్నం రహదారి అడుగడుగునా పెచ్చులూడి రాళ్లు తేలడంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలకు గురవుతున్నారు. పలాస నుంచి పర్లాకిమిడికి వెళ్లేందుకు హైవే నుంచి ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటోంది. రెండు రాష్ట్రాలను కలిపే ప్రధాన మార్గం కావడంతోపాటు మెళియాపుట్టి, పలాస మండలాల్లోని పలు గ్రామాలకు వెళ్లే మార్గం కావడంతో ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. టెక్కలిపట్నం వద్ద మూడు రోడ్ల జంక్షన్ నుంచి గ్రామం చివరి వరకు రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా మారడంతో వాహనాలు త్వరగా పాడవుతున్నాయని పలువురు చోదకులు వాపోతున్నారు. గత ఐదేళ్లలో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్డు మరమ్మతులకు సైతం ఎటువంటి చర్యలు తీసుకోలేదని పలువురు వాహనచోదకులు వాపోతున్నారు.

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమణమూర్తి

పోలాకి, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం కుట్టుశిక్షణ కేంద్రాలను ప్రారంభిస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శుక్రవారం దండు లక్ష్మీపురం తుఫాన్ షెల్టర్‌లో 120 మంది మహిళలకు కుట్టుశిక్షణ పొందేలా మండలస్థాయి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కుట్టుశిక్షణ కేంద్ర కోర్డినేటర్ చంద్రశేఖర్, కుట్టుశిక్షకులు, వెలుగు ఏపీఎం రాజారావు, ఎంపీడీఓ రవికుమార్, ఎంవీనాయుడు, ఆర్‌కేనాయుడు, ఎస్‌ఎన్‌దాస్, డోలప్రసాదరావు, లావేటికృష్ణ పాల్గొన్నారు. తొలుత కేజీబీవీ గంగివలస నిర్మించిన అదనపు భవనానికి శంకుస్థాపన, గుప్పెడుపేట వైద్యశాల అదనపు భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ శశిభూషణరావు, ఎంపీడీవో రవికుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు విజయవంతం చేయండి

నందిగాం, మే 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జూన్ ఐదోతేదీన నిర్వహించనున్న మూడో రాష్ట్ర కౌన్సిల్ మహాసభలను విజయవంతం చేయాలని కార్యక్రమ జిల్లాకన్వీనర్లు శిమ్మ సోమేశ్వరరావు, ఎం.సంతోష్ కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో మహాసభలకు సంబంధించిన చలో విజయవాడ గోడపత్రికలను ఎంపీడీవో కుమార్ పట్నాయక్ కార్యదర్శులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిశాఖల ఉద్యోగులు హాజరై ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవోపార్వతీశం, సీనియర్ సహాయకులు వెంకటరెడ్డి, కార్యదర్శులు రమణబాబు, లక్ష్మణరావు, గోపీనాథ్ పాల్గొన్నారు.

అభయాంజనేయ ఆలయ కమిటీ ఎన్నిక

వజ్రపుకొత్తూరు, మే 16 (ఆంధ్రజ్యోతి):అక్కుపల్లిలోని అభయాంనేయ ఆలయ అభివృద్ధి కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేవెల్ నాయుడు, ఉపాధ్యక్షుడిగా కాస వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా కాస ముకుందరావు, సంయుక్త కార్యదర్శిగా బర్రిభూపతి, కోశాధికారిగా కాససోమశేఖర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీరామ సేవాసంఘం అధ్యక్షులు మోన వరప్రసాద్ పాల్గొన్నారు.

రీసర్వేలో తప్పిదాలు జరిగితే చర్యలు: ఆర్డీవో


టెక్కలి: చిన్నబమ్మిడిలో సర్వే సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, మే 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రీసర్వే పక్కాగా జరగాలని, తప్పిదాలు జరిగితే చర్యలు తప్పవని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం కోటబొమ్మాళి మండలం లోని బమ్మిడి, చిన్నబమ్మిడి ప్రాంతాల్లో జరుగుతున్న రీసర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు రీసర్వే నోటీసులు అందాయా, లేదా ఆర్డీవో ఆరాతీశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే మామిడి జనార్దనరావు, కోటబొమ్మాళి సర్వేయర్ శివరామ్మూర్తి పాల్గొన్నారు.

●నరసన్నపేట, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడగాంలో రీసర్వేను ఆర్డీవో సాయిప్రత్యూష శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్. సత్యనారాయణ, ఆర్‌ఐలు సాయిరాం, మండల సర్వేయరు అప్పలస్వామి పాల్గొన్నారు.

గొలియాపుట్టిలో కుంభాభిషేకాలు

జలుమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గొలియాపుట్టి ఉమా రామలింగేశ్వరస్వామికి శుక్రవారం కుంభాభిషేకాలు నిర్వహించారు. పుష్కర వార్షికోత్సవం పురస్కరించుకొని పురోహితులు అక్కాజోష్యుల రమేష్‌శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు కుంభాభిషేకం పూజలు నిర్వహించారు. శనివారం సామూహిక రుద్రాభిషేకాలు, ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు: ఏపీఎం


చీపి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

హరిపురం,మే16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ప్రజల ఆరోగ్యానికి మేలని ఏపీఎం పి.కూర్మారావు తెలిపారు.శుక్రవారం మందస మండలంలో చీపి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ ఎస్.బాలకృష్ణ ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. అనంతరం రైతులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ చిరంజీవి, వెంకటరావు, ఈశ్వరరావు, నరేష్, సిబ్బంది గంగమ్మ, సుహాసిని పాల్గొన్నారు.

త్వరగా అనుమతులు ఇప్పించండి

పలాస, మే 16(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతులు త్వరగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఎస్.రామారావు కోరారు. శుక్రవారం పలాస-కాశీబుగ్గలోని మునిసిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయఉద్యోగులతో ఓపెన్‌ఫోర్మ్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మునిసిపాలిటీలో అక్రమకట్టడాలు గుర్తించిచర్యలు తీసుకోవాలని కోరారు.

'పీఎంశ్రీ'తో మౌలిక వసతులు

పోలాకి, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ పథకం(పీఎంశ్రీ) ద్వారా మౌలిక వసతుల కల్పనకు రానున్న విద్యాసంవత్సరంలో రెండు విడతలుగా కేజీబీవీ పాఠశాలలు ఎంపిక య్యాయని జిల్లా సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ ఎస్.శశిభూషణరావు చెప్పారు. శుక్రవారం గంగివలస కేజీబీవీ పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం ద్వారా రూ5.71కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రయోగశాలలు, క్రీడామైదానాలు, నూతన భవననిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. కేజీబీవీల్లో ఆరోతరగతి ప్రవేశాలకు రాష్ట్రస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు రావాల్సిఉందన్నారు.ఆయన వెంట ఇన్‌చార్జి జీసీడీఓ ఉమ, గంగివలస కేజీబీవీ కళాశాల ప్రిన్సిపాల్ శారద ఉన్నారు.

గురుకులాల్లో సిబ్బందిని భర్తీచేయాలి

టెక్కలి, మే 16(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు నోటిఫికేషన్ ద్వారాతక్షణమే భర్తీచేయాలని దళిత జేఏసీ నాయకులు కోరారు. శుక్రవారం టెక్కలిలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ 15ఏళ్లుగా పార్ట్ టైమ్, గెస్టటీచర్లగా విధులు నిర్వహిస్తున్న వారికి నోటిఫికేషన్‌లో వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. జిల్లాలోని బాల బాలికల డిగ్రీ కళాశాలలు రెండు,పారామెడికల్ కోర్సులు ప్రవేశ పెట్టాలని తెలిపారు.సమావేశంలో జేఏసీ నాయకులు మిస్క కృష్ణయ్య, బెలమర ప్రభాకర్, డి.గణేష్, చల్లా రామారావు, మట్ట పురుషోత్తం, కె.దాలయ్య, జె.బాబూరావు, మురళీధర్, గోపి, దమయంతి, సూర్యం, సంజీవరావు పాల్గొన్నారు.

కాలువలకు మరమ్మతులు చేయండి

జలుమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవకముందే సాగునీటి కాలువలకు మరమ్మతులు చేయించాలని ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. జలుమూరులో వంశధార, ఇరిగేషన్, ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులు, కాలువల కింద ఉన్న పిల్ల బట్టిలు ఉపాధినిధులతో మరమ్మతులు చేయించాలన్నారు.సమావేశంలో తహసీల్దార్ జె. రామారావు,ఏవో సురేష్, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఏపీవో శేఖర్ పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు వేయాలి

మందస,మే16 (ఆంధ్రజ్యోతి): కాలువలు, చెరువుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు వేయాలని ఎంపీడీవో వెంకటరావు ఆదేశించారు.శుక్రవారం మందస ఎంపీడీవో కార్యాలయంలో ఇరిగేషన్, జీఎస్‌ఆర్ ఈజీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడ ఏ పనులు చేపట్టాలో సమగ్రంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్చకు సిద్ధం

నరసన్నపేట, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమ నిర్మాణాలకు టీడీపీ నాయకులు ఊతమిస్తున్నారని వైసీపీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఇందిరా నగర్‌లో అక్రమ నిర్మాణాలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు సాగించడం వెనుక టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, చంద్రభూషణగుప్త పాల్గొన్నారు.


పలాస: ఎమ్మెల్యే శిరీషకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ నాయకులు


పలాస: ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు అందజేస్తున్న గాలి కృష్ణారావు, టీడీపీ నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే శిరీష జన్మదిన వేడుకలు

పలాస, మే 16(ఆంధ్రజ్యోతి):పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష జన్మదిన వేడుకలు స్థానిక ఎమ్మెల్యే నివాసం, టీడీపీకార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, అభిమానులు, నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.కాశీబుగ్గ సీతారామాలయం, కోసంగిపురం లలితా చారిటబుల్ ట్రస్టులో వృద్ధులు, పేదలకు అన్నదానంచేశారు.నాయకులు గాలి కృష్ణారావు ఆధ్వర్యంలో పలాసప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టగా, లొడగల కామేశ్వరరావు యాదవ్‌ఆధ్వర్యంలో అన్నదానంచేశారు.నియోజకవర్గ టీడీపీసమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి అన్న క్యాంటీన్‌లో ఉచితంగా భోజనాలు అందించారు. కాగా ఎమ్మెల్యేకు ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ హేమబాబుచౌదరి, డోకిరామారావు, డీవీడీవీకుమార్ (బోసుబాబు),గొరకల వసంతస్వామి,వైద్యాధికారులు టి.బాలకృష్ణ, ఎం.మల్లేశ్వరరావు, మల్లా రామేశ్వరరావు, పెంట ఉదయశంకర్, ఎంపీడీవోలు ఎ.వసంత్‌కుమార్, వై.వెంకటరమణ, ఎన్.రమేష్‌నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పీపీ సూర్యనారాయణ, పీఆర్ డీఈఈ ఎ.రవిబాబు, దువ్వాడ శ్రీకాంత్, టి.విశ్వనాథం శుభాకాంక్షలు తెలియజేశారు.

●వజ్రపుకొత్తూరు, మే 16(ఆంధ్రజ్యోతి):వజ్రపుకొత్తూరు టీడీపీ కార్యాలయంలో శిరీష జన్మదిన వేడుకలు పార్టీ మండలాధ్యక్షుడు సూరాడ మోహనరావు అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కటింగ్‌చేసి మిఠాయిలు పంపి ణీచేశారు. పేదలకు పండ్లు, రొట్టెలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు ఉమామహేశ్వరరావు, నెయ్యిల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

●హరిపురం, మే16 (ఆంధ్రజ్యోతి):హరిపురం, మందసలో శిరీష జన్మదిన వేడుకలు టీడీపీనాయకులు బావన దుర్యోధన, రట్టిలింగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. హరిపురంపార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేశారు.సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు.మందస నర్సింగస్వామిఆలయంలో పూజలుచేసి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గారకృష్ణారావు, నాగేశ్వరరావు, దాసరి తాతారావు, బైరిశెట్టి గున్నయ్య, వెంకట్, బమ్మిడి కర్రయ్య, మహేష్ పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లాలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు

డెంగీపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు కోరారు. శుక్రవారం జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యసిబ్బంది జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీలను సిబ్బంది నిర్వహించారు.

●ఎల్.ఎన్.పేట, మే 16(ఆంధ్రజ్యోతి) గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధులను నివారించడం సాధ్యమని వైద్యాధికారి వసుధ తెలిపారు. తురకపేటలో పీహెచ్‌సీ నుంచి డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

●సంతబొమ్మాళి,మే16(ఆంధ్రజ్యోతి):దండుగోపాలపురం పీహెచ్‌సీ సిబ్బంది జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకుని డ్యెంగూపై అవగహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శివరంజని,సూపర్‌వైజర్ నాగేశ్వరరావు,ఆప్తాలమిక్ అసిస్టెంట్ ఎం.ఆర్.కె.దాస్ ,ఫార్మాసిస్టు సుబ్రమణ్యం సిబ్బంది పాల్గొన్నారు.

●జలుమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి):అచ్యుతాపురం ఆరోగ్య కేంద్రం సిబ్బంది,ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్య క్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పూజారి సుజాత పాల్గొన్నారు.

● నరసన్నపేట, మే 16(ఆంధ్రజ్యోతి): ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులు గొలివి సుజాత, షాలిని డెంగీపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జీవీ రమణమూర్తి పాల్గొన్నారు.



సంతబొమ్మాళి: డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


జలుమూరు: అచ్యుతాపురంలో ర్యాలీ..